# ప్రతి ఒక్కరికి అప్పుడప్పుడు (ఓగైన) చెడ్డ రోజొకటొస్తుంది (లూకా 10:38-42)

ప్రతి ఒక్కరికి అప్పుడప్పుడు (ఓగైన) చెడ్డ రోజొకటొస్తుంది. కొంతకాలం క్రిందట, నిజంగా ఒక చెడ్డదినాన్ని ఎదుర్కొన్న తాపీవాని గూర్చి చదివాను. కంపెనీ యాక్సిడెంట్ ఫారం మీద అతడిచ్చిన రిపోర్టు ఈ క్రింద చూడవచ్చు.

> నేను కట్టడం దగ్గరకు వచ్చినప్పుడు, పైనున్న రాళ్లలో కొన్నింటిని తుఫాను క్రిందికి పడద్రోసినట్టు చూచాను. గనుక కట్టడపు పైభాగంలో దూలానికి (కప్పీ) అంటే, గిలకకట్టి రెండు పీపాల యిటుకలను పైకి చేరవేశాను. పాడైన భాగాన్ని సరిచేసిన తరువాత చాలా యిటుకలు మిగిలిపోయాయ్. అప్పుడు నేను క్రిందికి దిగివచ్చి తాడు చివరికొనను మెల్లగా ఊడదీయ నారంభించాను. దురదృష్టవశాత్తు, పీపాలోని ఇటుకలు నాకంటే ఎక్కువ బరువుగా ఉండిపోయాయ్. గనుక ఏమి జరుగబోతుందో నేను తెలిసికొనకముందే, నన్ను పైకి తోస్తూ, పీపాక్రిందికి దిగ నారంభించింది.
>
> అప్పటికే నేను నేలమీదికి దూకలేనంత ఎత్తులోనికి వెళ్లిపోయాను. గనుక త్రాడుపట్టుకొని వ్రేలాడుదామనుకున్నాను. అతివేగంగా క్రిందికి దిగుతున్న పీపా నా భుజం అదిరిపోయేలా గుద్దుకుంది. గత్యంతరం లేక, నేను పైకి లాగబడ్డాను. నా తల దూలానికి మోదుకుంది, నా వ్రేళ్లు గిలకలో చిక్కుబడి నలిగిపోయాయ్. అత్యంత వేగంతో దిగిన పీపా నేలపై బలంగా కొట్టుకునే సరికి, దాని అడుగుభాగం పగిలిపోయి, దానిలో ఇటుకలు కారిపోయాయ్.
>
> ఇప్పుడు నేను పీపాకంటె బరువయ్యాను. గనుక భయంకరమైన వేగంతో క్రిందికి నెట్టబడ్డాను. అదే వేగంతో పీపా పైకి లాగబడింది. అది తిరిగి మధ్యకు చేరి నన్ను తాకినప్పుడు నా మోకాళ్లకు చీలమండలాలకు మధ్య బాగా గాయపరచబడ్డాను. పైగా నేను నేలను గుద్దుకునేసరికి అక్కడ పడియున్న ఇటుకలమీద పడి బాధాకరమైన చాలా దెబ్బలు, గాయాలు తిన్నాను. ఈ సమయానికి నా మతిపోయి, నేను పట్టుకొనియున్న తాడుకొనను విడిచిపెట్టాను. గనుక బలమైన వేగంతో తిరిగి పీపావచ్చి నా తలను భయంకరంగా మోది నన్ను ఆసుపత్రిపాలు చేసింది. మర్యాదగా సిక్ లీవ్ కొరకు నేను వేడుకొంటున్నాను.

నేను ఈ పనివానిలాంటి వాడనని చెప్పవచ్చు. మనం ఎవరమైనా సరే, మనకు అప్పుడప్పుడు ఒక చెడ్డ దినం ఉంటుంది.

మనం బైబిల్లో గుండా వెళ్లేటప్పుడు, వారి జీవితాల్లో కొన్ని క్షణాలు ఘనీభవింప జేయబడినట్టున్న లేక ప్రత్యేకంగా కనుపరచబడినట్టున్న వ్యక్తుల ఫొటోలను ప్రేరేపింపబడిన లేఖికులు తీసినట్టు మనం చూస్తాం. ఎల్లవేళలా జనులు కావాలనుకున్న క్షణాల్లోనే ఆ లేఖికులు వారిని పట్టలేదు. అదెలా జరుగుతుందో మనం గ్రహించవచ్చు. ఎలాగంటే - మన డ్రైవర్ లైసెన్సుమీద, లేక పాస్‌పోర్టుమీద ఉన్న లాంటివి ఒకటో రెండో పాడైన ఫొటోలు మనందరికి ఉంటాయ్. (మనం కోరిన ఫోజులోనే ఫొటోలన్నీ ఉండవు. మనకు యిష్టంలేని ఫోజుల్లో కూడా ఫొటోలుంటాయి. అలాగే మానసిక లేక ఆత్మసంబంధమైన ఫొటోలు కూడా!!)

ఈ పాఠంలో, లూకా 10లో నుండి తీయబడిన, మార్తయొక్క ఫోటోను చదువబోతున్నాం. అది మార్తకు ఓగైన (చెడ్డ) దినం. (లూకాయొక్క క్లిప్పింగ్‌లో మార్త యిలా కన్పిస్తుంది).

మరియు, లాజరనే వారి సోదరియైన మార్తను గూర్చి మనం ఆలోచనచేస్తే, మనకేమి మతికి వస్తుంది? ''అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ము చున్నానని ఆయనతో'' చెప్పెను. ఆమె చెప్పిన మాటలను గుర్తుచేసి కొంటావా? (యోహాను 11:27). క్రొత్త నిబంధనలోని గొప్ప ఒప్పుకోలులలోయిది ఒకటి- ఇది మత్తయి 16:16లో, మనస్సులో నిలిచిపోయేలా, పేతురు చేసిన ఒప్పుకోలు వంటిది. యోహాను 12లో, ప్రభువైన యేసుతో తన సోదరి, సోదరునితో కలిసి ప్రభువుయొక్క సహవాసాన్ని అనుభవించుతున్నట్టు ఆమెను ఆలోచిస్తావా? నా ఊహ ఏమంటే, మార్త అనే పేరు మనం వినగానే, తన జీవితంలోని ఉన్నతమైన లక్షణాలను గూర్చి మనలో ఎక్కువ మందిమి ఆలోచింపము. కాని లూకా 10లో మార్త నిలిచియున్న ఓగైన (చెడ్డ) దినంలోని హీనమైన లక్షణాన్నే మనస్సుకు తెచ్చుకుంటాం.

## మార్త ఓగైన దినాన్ని ఎదుర్కొన్నప్పుడు

### అది గొప్పగా ప్రారంభింపబడిన దినమే (38-39 వచనాలు)

ఆ రోజు గొప్పగానే ప్రారంభమయ్యింది. ''అంతట వారు ప్రయాణామై పోవుచుండగా'' అంటూ మన పాఠ్యభాగం ప్రారంభమౌతుంది. ''వారు'' అనేది- ప్రభువైన యేసును, ఆయన శిష్యులను సూచిస్తుంది. పాలస్తీనాలో ప్రభువైన యేసుయొక్క పరిచర్య ముగించబోయే దినాల్లో జరిగిన సంఘటనది! ఆయన యెరూషలేమునకు వెళ్లుతున్నట్టున్నారు. మార్గంలో - ''ఆయన యొక గ్రామంలో ప్రవేశించారు'' (38b వ.). ఇది యెరూషలేమునకు రెండు మైళ్ళ లోపున, ఒలీవ కొండకు తూర్పు దిగువ భాగంలో ఉన్న బేతనియ (యోహాను 11). యెరూషలేమునకు వెళ్లే తన ప్రయాణంలో, ఆయన పలు మార్లు చేసినట్టే -

బేతనియలో ప్రభువు ఆగినట్టున్నారు.

''మార్త అనే స్త్రీ ఆయనను తన యింట చేర్చుకొంది'' (38cవ.). మార్త ముగ్గురు పిల్లలలో పెద్దదైయుండవచ్చు. ఆమెకు ఒక సహోదరి, ఒక సహోదరుడున్నారు. ఆ యిల్లు ఒకవేళ మార్తదే అయ్యుండవచ్చు. ''మార్త తన యింటిని ఆయనకు తెరచెను'' - అని NIV అంటుంది. ఆతిథ్యానికి ఆమె మాదిరిగా ఉంది!

లూకా ఈ సంఘటనను క్లుప్తీకరించినట్టున్నాడు. ఉదాహరణకు, లాజరు అక్కడ ఉండియుండవచ్చు గాని, అతన్ని లూకా ప్రస్తావించలేదు. పైగా ప్రభువైన యేసుతో ప్రయాణం చేస్తున్న శిష్యుల యొక్క వివరాలను కూడా తెలుపలేదు. ప్రభువు భోజనానికి ఆహ్వానించబడినప్పుడు వారెక్కడికి వెళ్ళుంటారో? ఈ సంఘటన జరిగిన తరువాత వచనంలో శిష్యులు ప్రస్తావించబడ్డారు (లూకా 11:1). అందువలన వారు దూరంగా వెళ్లలేదన్న మాటే . ఒక వేళ మార్త యింటికి వారు కూడా ఆహ్వానించబడియుంటారు. లూకా 10లో చెప్పబడిన భోజనానికి పదహారుమంది ఆహ్వానింపబడి యుండవచ్చు. ఒకవేళ నీవు స్త్రీవైయుంటే - ''మార్తకు అది కష్టమైన రోజే!''నని నీవు తల ఊపుతూ ఉండవచ్చు. పదహారుమందికి భోజనం సిద్ధపరచడం అంత తేలికైన పనేమీ కాదు సుమీ.

ఈ విధంగా, ప్రభువైన యేసు తన స్నేహితులను సందర్శించిన ఆ సంఘటన యింటికి సంబంధించిన వాతావరణంతో ఆరంభవౌతుంది. ''- నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవుగాని మనుష్యకుమారునికి తల వాల్చుకొనుటకైనను స్థలములేదని'' ప్రభువు ఒక రోజున అన్నమాట వాస్తవమే (మత్తయి 8:20). అయినా, వారు తమ యిండ్లను సువార్తకొరకు, విడిచి పెట్టినట్టయితే, నూరంతలు పొందుతారని యేసు తన శిష్యులతో అన్నారు గదా? (మార్కు 10:29-30). అలాగే, ప్రభువైన యేసుకు సొంతదైన యిల్లు లేకపోయినా, పాలస్తీనా అంతటిలో ఆయనకు అనేక యిండ్లున్నాయి. అలాటి వాటిలో, కపెర్నహోములో పేతురు అత్తయిల్లు, బేతనియలో మార్త యిల్లు కూడా ఉన్నాయి!!

''ఆమెకు మరియ అను సహోదరి యుండెను. ఆమె యేసు పాదముల యొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను'' (39వ.). ''బోధకుని పాదముల యొద్ద కూర్చుండుటలో రెండంతల విశేషముంది. మరియవలే, మామూలుగా, అక్షరార్థంగా ఉపదేశకుని పాదాలవద్ద విద్యార్థి వింటానికి కూర్చుంటాడు. దీనికి అలంకార భావన కూడా ఉంది. అదేమంటే, అలా కూర్చున్న విద్యార్థి ఆ ఉపదేశకుని శిష్యుడని రుజువు చేసికొంటాడు. పౌలు ''గమలియేలు పాదముల యొద్ద పెరిగినట్టు'' సూచించాడు (అపొ. 22:3; KJV). బైబిల్లో ఈ మరియ ఎప్పుడు కన్పించినా, ఆమె ప్రభువైన యేసు పాదాల దగ్గర ఉన్నట్టే కన్పిస్తుంది. లాజరు చనిపోయినప్పుడు, మరియ

ఏడ్చుతూ ఆయన పాదాలమీద పడింది (యోహాను 11:32). ఆ తరువాత బేతనియలో ప్రభువు విందులో ఉండగా, మరియ మోకాళ్లని ఆయన పాదాలకు అత్తరు పూసింది (యోహాను 12:3). సాధారణంగా రబ్బీలు స్త్రీలను తమ పాదాల దగ్గర కూర్చోనిచ్చే వారు కారు. స్త్రీలు నేర్చు పొందగలరనే భావన అనేకులకు లేదు. ప్రభువైన యేసైతే ఆ దినాల్లో ఉన్న దురభిప్రాయాంతో ఏకీభవించలేదు. అందువలన, మరియ ప్రభువు పాదాల వద్ద కూర్చుండి ఆయన మాటలు వింటూ, నేర్చుకొంటూ ఉండేది.

ఒలీవ కొండ యొక్క తూర్పుకు దిగువ భాగంలో ఉన్న చిన్న యింటికి తిరిగి వద్దాం. నీవు ప్రభువైన యేసు పాదాలవద్ద కూర్చుండి, ఆయన మాటలు వింటున్నావ్. త్వరలో రుచికరమైన భోజనాన్ని ఆరగించబోతున్నావనే వాగ్దానంతో గాలి నోరూరే వాసనలతో నింపబడుతుంది. (మార్త మంచిగా వంట చేస్తుందని ఆ ఊరిలో అందరికి తెలుసట!) శారీరకంగాను, ఆత్మ సంబంధంగాను సంపూర్ణ సమ్మేళనమై, అది మనోహరమైన దృశ్యంగా ఉంది. అది అద్భుతమైన దినమే!

మన మనో భావన సరైయిందైతే, ప్రతి దినమూ ప్రత్యేకమయ్యిందే కావచ్చు: ''ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము. దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము'' (కీర్తనలు 118:24). మార్తలా, మనం కూడా ప్రభువును మన గృహాల్లోనికి, జీవితాల్లోనికి ఆహ్వానించవచ్చు. ''ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపుతీసినయెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము'' అని ప్రభువు తెలియజేశారు (ప్రకటన 3:20). ఏ రోజైనా, నీకు-నాకు గొప్ప దినంగా ఉండవచ్చు! (ఆ దినాన్ని మనం మల్చుకొనే విధానంపై అది ఎక్కువగా ఆధార పడియుంటుంది).

## చిరాకు పడేలా మారిన రోజు (40వ.)

40వ వచనంలో మార్త యొక్క దినం చిరాకుపడేలా తయారయ్యింది. ''మార్త విస్తారమైన పనిపెట్టుకొనుట చేత తొందరపడి'' - అని KJVలో అన్నట్టుంది. ''(భోజనాల) సిద్ధపాటువలన మార్త పరధ్యానంలో ఉంది'' అన్నట్టు NASB సూచిస్తుందట. అటు పనుల తొందరలో ఉండటం అనూ, లేదా ఇటు పరధ్యానంలో ఉండటం అనూ; దాన్ని నీవేమనదలచుకొన్నా, అసలు గ్రీకుపదం - ''ఆమె శ్రద్ధ సంచరించుతున్నట్టు'' సూచిస్తుంది.

మార్తయొక్క యింటికి ఒకే ఒక గది యుండి యుండవచ్చు. (ఆ దినాల్లో అనేక యిండ్లకు ఒకే గది ఉండేది). అందువలన మార్త ఒక మూలన వంటచేస్తూ ఉండవచ్చు. ప్రభువు మరియతో మరొక మూలన మాట్లాడుతూ ఉండవచ్చు. మార్త భోజనం సిద్ధం చేస్తునే, ప్రభువు మాటలు వినియుండవచ్చు. ''అయితే మార్త పర

ధ్యానంలో ఉంది''; ఆమె మనస్సు సంచారం చేస్తుంది!

మనలో ఎక్కువ మంది మార్తలా ఉండవచ్చు. మనం బైబిలు తరగతిలోనో లేక ఆరాధనలోనో ఉన్నాం. దేవుని వాక్యం ప్రకటింప బడుతూవుంది, అయితే మన మనస్సులు వేరే వాటి మీదికి వెళ్లిపోతాయ్. కొన్ని సందర్భాల్లో, మన ఆలోచనలు మార్త ఆలోచనల్లా, ''మధ్యాహ్నం భోజనానికి ఏమిటి?'' అంటూ పోవచ్చు.

''సిద్ధపరచవలసిన భోజన పదార్థాలచే మార్త పరధ్యానంలో పడింది'' అన్నట్టు NIV అంది. ఈ భోజన పదార్థాలు చేయాలని తన మనస్సులో ఉంది. అయితే ప్రభువు ఆ విందును కోరినట్టుగాని, లేదా దానికొరకు కనిపెట్టినట్టుగాని ఏ సూచనా లేదు. అయితే విందు చేయాలనేది మార్త యొక్క ఆలోచన. చెడ్డగా (ఓగుగా) ఉండే మన దినాలు సహితం అర్థరహితంగా కనిపెట్టే వాటితో తరచుగా ప్రారంభ మౌతాయి. అవి యితరుల మనస్సులో కాదు; మన మనస్సుల్లోనే ప్రారంభమౌతాయి. మార్త యొక్క భావాలు మంచివే. ఆమె ప్రభువుకు విందు సిద్ధపరచగోరింది. మంచి భోజనం ఆయనకు వడ్డించడం ద్వారా, ఆయన్ను ఘనపరచాలనుకుంది. అయితే విందు సిద్ధ పరచడమనేది భారంగా చేయవలసిన అవసరంలేదు; విసుగుతో చేయనవసరంకూడా లేదు.

తప్పనిసరిగా చేయాలన్నట్టు తాను భావించి కాబోలు, ఆమె ప్రభువైన యేసు నొద్దకు వచ్చి - ''ప్రభువా, నేను ఒంటరిగా పని చేయుటకు నా సహోదరి నన్ను విడిచిపెట్టినందున నీకు చింతలేదా? నాకు సహాయం చేయుమని ఆమెతో చెప్పుమనెను'' (40 వ.). ''నా యంతట నేనే ఈ పని చేసేలా, నా సహోదరి నన్ను విడిచింది'' అని NIV అంటుందట. దీనికి ముందు, సూక్ష్మంగా మార్త మరియకు సంజ్ఞలు చేసే ఉంటుందని నేను ఊహిస్తున్నా! కుండలు చట్టులు టకటక శబ్దం చేయడం; బీరువా తలుపులు తటతట కొట్టడం, మరియవైపు అర్థవంతమైన చూపులు చూడడం వగైరాలను నేను చూడగలను. ''బల్ల మీదికి ఈ భోజనం నేనెప్పుడు తేగలను?'' అంటూ శబ్దంతో ఆశ్చర్యాన్ని వ్యక్త పర్చుతుంది. మరియయైతే ఆమెను అలక్ష్యం చేసింది. ప్రభువు చెప్పే మాటల్లో మరియ నిమగ్నమై, మార్త సూచించే సూచనలను తాను వినకుండానే లేక పట్టించుకోకుండానే పోవచ్చు.

ఆ దృశ్యంతో స్త్రీలు తమ్మును పోల్చుకోవచ్చు. మీ యింటినిండా చుట్టాలున్నా రనుకో. దాసిలా నీవు ఒంటరిగా పని చేస్తుంటే, మీ నివాసపు గదిలో వారు కూర్చుండి, సరదాగా మాట్లాడుకొంటూ, నవ్వుకొంటున్నారు. అలాటప్పుడు, ''ఒకరైనా వచ్చి నాకు ఎందుకు సహాయం చేయకూడదు?'' అనుకొంటూ నీవు లోలోపలే ఉడికి పోతున్నావ్ కదా?

మార్త యొక్క ఓర్పు హద్దులు దాటింది. గనుక ఆమె ప్రభువు నొద్దకు పిర్యాదుతో వచ్చింది. ''ప్రభువా, నీకు చింతలేదా?'' అని విలపించింది. మనమందరం ఇలాటి

పరిస్థితిలో ఉన్నాం. మన కందరికి ఒక చెడ్డ దినం ఎదురౌతుంది. మనం ఏర్పాటు చేసికొన్నట్లు ఏదీ జరగులేదనుకో! మనం జాగ్రత్తగా ఉండకపోతే, మార్త పడిన ఉరిలో మనం చిక్కుకుంటాం. ''ప్రభువా, నాకీ సమస్యలున్నాయే, నీకు చింతలేదా?'' అన్నట్లు ప్రవర్తిస్తాం!!

''ప్రభువా, ఈ పనంతా నేనే చేసేలా, నా సోదరి నన్ను ఒంటరిగా వదలితే, నీకు చింతలేదా?'' అని మార్త అంటుంది. ''ఇప్పుడు వదలి వెళ్లిందంటే, మరియ యింతకుముందు మార్తకు సహాయం చేస్తూ ఉండి, ప్రభువుకు ఉపచారం చేయడానికి గాను మార్తను ఒంటరిగా పనిలో వదలి వేసిందన్నమాట. భోజనం సిద్ధపరచడం ఎంత ప్రాముఖ్యమో, అతిథిని గమనించడం లేక సత్కరించడం అనేది విందు చేసేవారికి అంతే ప్రాముఖ్యం. ఆ వాస్తవాన్ని మార్త మరచిందో, లేక అలసి, వేడెక్కి, విచారంతో ఉందో! తాను బల్లను ఏర్పాటు చేసేలోపు యింకొకరు మరో పనిచేస్తే బాగుండు ననుకుందో; మొత్తానికి, ''ప్రభువా ... నాకు సహాయం చేయుమని ఆమెకు చెప్పు'' మని మార్త కోరింది. (ఒక వేళ మీ పిల్లలొచ్చి, ''అమ్మా ఆమెను వెళ్ళి పొమ్మను!'' లేక నానా, ''నా జోలికి రావద్దని వానికి చెప్పు'' అన్నట్లు) మార్త కేవలం మరియను మాత్రమే ఖండించడం లేదు; ఆమె ప్రభువును కూడా ఖండిస్తుంది!!

మార్త యొక్క మంచిదినం చెడ్డగా మారడానికి ఏమి జరిగిందో నాకు అంతా తెలియదు. ఒకవేళ వేటమాంసం యిగిరి పోయిందేమో; లేదా, రొట్టె క్రిందపడిపోయిందేమో, లేకుంటే బిస్కట్లు మాడి పోయాయేమో. వీటన్నిటికిపైగా, ఒకవేళ తనకు బ్రద్దలు కొట్టుకొనిపోయే తల నొప్పి వచ్చిందేమో. అయితే నాకు యిది మాత్రం తెలుసు: ఏది ఎలా జరిగియున్నా సరే, మార్త తన పిర్యాదు చేత పరిస్థితిని అంతకంటె ఎక్కువగా పాడుచేసింది. అలాటిది నీకెప్పుడైనా సంభవించిందా? మనకు ఓగ్గైనరోజు ఎదురైనప్పుడు, మనలో ప్రతివాడికి ఏదో ఒక చెడ్డదినం రాబోతుందంటూ, కొందరు కారణాలను వక్రంగా త్రిప్పి వేస్తారు (అంటే-పరిస్థితికి వారే కారణమైయుండి, యితరుల మీద దాన్ని రుద్దుతారు).

ఇక్కడ ఆనందదాయకమైన యింటి వాతావరణపు దృశ్యంతో ప్రారంభించాం. ప్రభువైన యేసు దేవుని వాక్యాన్ని బోధిస్తున్నారు; మరియ ఆయన పాదాల దగ్గర కూర్చుంది. భోజనాల వంటకంతో కమ్మని వాసన వస్తుంది. అది మంచిగా ప్రారంభమైన రోజే! ఆ రోజు చిరాకుపడే పరిస్థితిగా మారిపోయింది. అంతగా ప్రాముఖ్యంకాని పనుల్లో తొందరపడడంవల్ల, మార్త యింటిమీదికి మనోవ్యాకులత వచ్చి నిలిచింది. మంచిగా ఉన్న దినాన్ని చెడ్డదిగా మల్చుకొనడం అంత కష్టమేమీ కాదు. మనం చేయవలసిన పనంతా ఏమంటే ఓర్వలేని తనాన్ని కొంచెం కదిలించి చూడు. అంటే - తనకు తానే సానుభూతి కనుపరచు కొనడం. శ్రద్ధగా ఆలోచింపకుండా మాట్లాడడం వంటి పనులే చాలు. మార్త చేసినట్లు, మన నోళ్లను

ఫిర్యాదు చేయడానికి తెరిచినప్పుడు, ఆనందదాయకమైన దినాలు దుఃఖసహితంగా మారిపోతాయి. (ఓర్పులేని తనం పరిస్థితులను పాడుచేస్తుంది).

**పాడైన రోజు-తిరిగి శ్రేష్ఠమైనదిగా మారడం (41-42 వచనాలు)**

కొంతసేపు ఆ రోజు చెడ్డదిగా మారిపోయింది. అంటే, ప్రభువు దయలేనివాడై యున్నట్టు తన పరిస్థితిని ఎరుగనివాడైయున్నట్టు మార్త ఆయనను ఖండించింది. అయితే దయగా ఆమె మందలింపబడుతుంది:

> అందుకు ప్రభువు- మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే. మరియు ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్దనుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను (41-42 వ.).

ఉపయోగింపబడిన కంఠస్వరం యొక్క ధ్వనిని మనం తెలిసికొనేలా, బైబిలులోని సంభాషణలన్నీ శ్రవణ నాడా (AUDIO TAPE) మీదికి ఎక్కించియుంటే బాగుండేదేనని నేను అనేక పర్యాయాలు కోరుకున్నా! అయినా, మార్తతో మాట్లాడిన ఈ సందర్భంలో, ప్రభువైన యేసు వినియోగించిన కంఠస్వరం యొక్క ధ్వనిని మనం ఊహించనవసరం లేదు. ప్రభువైన యేసు తక్కిన వారితో పాటు మార్తను ప్రేమించుతున్నట్టు యోహాను 11:5 గుర్తించింది. గనుక ఖండించడానికి ఆయన ఉపయోగించిన మాటలు క్రూరంగా లేక కఠినంగా ఉన్నాయనడం అసంభవం. ముఖం చిట్లించి, తలను ఊగిస్తూ, ''మార్తా ... మార్తా ... '' అంటూ, ప్రభువు పలికిన పలుకుల్లో ఆశాభంగం గోచరించినా, వాటిలో ప్రేమకూడా మిళితమైయుంది.

''మార్తా, మార్తా, నీవనేక పనులను గూర్చి విచారముకలిగి తొందరపడుచున్నావు'' ''నీవనేక పనులు పెట్టుకొని ఉద్రేకముతో గడబిడ లాడుతున్నావు'' అని క్రొత్త ఇంగ్లీషు బైబిలు అంటుంది. ''ఉద్రేకము,'' ''గడబిడ'' అనే మాటలు గ్రీకులో ''ముక్క'' అని అర్థమిచ్చే మూలంనుండి తర్జుమాచేయబడ్డాయి. తాను చేయనుద్దేశించిన పనులను చేయడంలో మార్త ముక్కలు కాబోతుంది. తాను లోపల తునిగిపోయింది. దాన్ని ఆమె బయటికి కనుబరచింది. తన చుట్టునున్న వారి జీవితాలను పరితాపకరంగా ఆమె చేస్తుంది! (తాను ముక్కలై యితరులను బాధిస్తుంది).

అయితే అవసరమైనవి కొన్ని విషయాలే, నిజంగా ఒక్కటి మాత్రమే. ''అవసరమయ్యింది ఒక్కటి మాత్రమే'' అనే మాటలకు -ఒక్క వంటకమే సరిపోతుందని ప్రభువు అన్నట్టు కొందరు వ్యాఖ్యాన కర్తలు భాష్యం చెప్పారు. ఆయన భోజనాన్ని గూర్చి ఈ సందర్భంలో మాట్లాడినట్టు నేను సందేహిస్తున్నా. ''స్వల్పాహారం - సంతోషకరమైన మార్త'' అందరిని తప్పక ఆనందింపజేయగలిగేవే! (అనేక పనులు - అలసిన మార్త అందరిని దుఃఖసాగరంలో దింపినట్టుంది).

''అవసరమైన'' ఆ ఒక్క సంగతేమో, తరువాత మాటల్లో యేసు యిలా సూచించారు; ''మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి తీసివేయబడదు.'' మరియ ఆత్మసంబంధమైన దానిని కోరుకొంది; మరియ నిత్యత్వానికి సంబంధించిన దాన్ని ఏరుకొంది. ప్రభువైన యేసు మాటలను ఆలకించడమే కావాలని ఆమె ఎన్నుకుంది. శరీర సంబంధమైన భోజనంకంటె, ఆత్మ సంబంధమైన ఆహారం విషయంలో ఆమె అక్కర కలిగియుంది.

మన జీవితాల్లో మంచి రోజులు చెడ్డవిగా మారడానికి కారణం; నేడుండి రేపు గతించిపోయే అనేక పనులు పెట్టుకొని ఉద్రేకంతో గడబిడ లాడడమే. అది యిప్పటినుండి నూట ఇర్వై సంవత్సరాల తరువాత జరుగబోయే సంగతులను గూర్చికాదు. ప్రాముఖ్యమైన సంగతుల విషయంలో నిజంగా అక్కర కలిగియుండి కాదు. కొన్ని సార్లు, దీర్ఘకాలంగా ఉండాలని దేవుడు ఉద్దేశించిన బాంధవ్యాలను, అల్పమైన వాటివలన కలతచెంది, చెడగొట్టుకొంటాం.

ఈ పాఠ్యాంశాన్ని నేను చదివినప్పుడు, తండ్రిగా, తాతగా దీన్ని నాకు వర్తింపజేసికోకుండ ఉండలేను. నేను నా పిల్లలకు, మనుమ సంతానానికి ఏమి వదిలి వెళ్ళుతున్నాను? దేవుని వాక్యాన్ని[1] వారు ప్రేమించడం అనే అవసరమైన ఆ ఒక్క దానికొరకు తగిన సమయాన్ని గడపకుండ, గతించిపోయే ఏవో కొన్ని వస్తువులను వదలి వెళ్ళాలనే భావనతో నేను పట్టబడవచ్చు.

అలాటప్పుడు ఇది ప్రభువైన యేసు మార్తను గద్దించిన దినంలా కేవలం చెడ్డదే! ఆయన ఆమెతో చెప్పింది ఏలాగుందంటే - ''నీవు వంటపని ఎప్పుడైన చేసికోవచ్చు, కాని నేను యిక్కడ ఉండబోయేది కొద్దిసేపే! ఈ అవకాశాన్ని పోగొట్టుకోవద్దు''. మనకందరికి ఈ పాఠం కావాలి. మన ప్రాధాన్యతలు తారుమారవ్వడం ఎంత సులభం! మార్త ప్రాధాన్యతలను తారుమారుచేసింది!

అదే సమయంలో, ప్రభువైన యేసు మాటలను మార్త ఆలోచించిన తరువాత, ఆ దినం మేలుగా మారింది. మిగిలిన ఆ దినాన్ని నేను యిలా ఆలోచిస్తున్నాను: ప్రారంభంలో వాతావరణం కొంత బాధింపబడినట్టుగానే ఉంది. మార్త భోజనం సిద్ధంచేసి వడ్డించింది. భోజనాన్ని మెచ్చుకొంటూ, ప్రభువైన యేసు ఆమెను మంచిగా తలంచేటట్టు చేశారు. తన ప్రియుడైన ప్రభువు మాటలు మార్త హృదయంలోనికి మెల్లగా దిగి ధ్యానించేలా చేశాయి.

మార్తలో జరిగిన మార్పును బట్టి, మిగిలిన రోజు అలా ఉన్నట్టు భావిస్తున్నాను. ఆ తరువాత మార్త ఉపచరించినట్టు యోహాను 12లో కన్పిస్తుంది. ఆ సందర్భంలో, మార్త తిరిగి ఎక్కువ మందికి భోజనం సిద్ధపరచవలసివచ్చింది. అయినా మార్త తిరిగి పిర్యాదు చేయలేదు. కుటుంబ ధననిధిలోనుండి, సాధారణంగా కుటుంబపు దాపరికంలోనుండి మరియ మిక్కిలి వెలగల అచ్చ జటామాంసి అత్తరు తెచ్చి,

ప్రభువైన యేసు పాదాలకు పూసినందుకు కూడా మార్త పిర్యాదు చేయలేదు. అంతే గాకుండా, ఈ సందర్భంలో కూడా మరియ మార్తకు సహాయం చేయలేదు. అయితే ఓగైన ఒకరోజున, కొన్ని వారాలకు ముందు, ప్రాముఖ్యమైన ఆ ఒక్క సంగతిని మార్త నేర్చుకొనియుంటుంది, అది ఆమె యొద్దనుండి తీసివేయబడదు.

జరిగిన చెడ్డ వాటిలోనుండి మనం (పాఠాలు) నేర్చుకుంటే, చెడ్డదినం మంచి దినంగా మారిపోతుంది.

తన చెడ్డదినపు అనుభవంనుండి మార్త మేలు పొందినట్టుంది. బైబిలు ఫొటో ఆల్బంలో కొన్ని పేజీల తరువాత ఉన్న మార్తయొక్క ఫొటోను చూపకుండ నేను ఈ పాఠ్యాంశాన్ని ముగించదలచుకోలేదు. గనుక యోహాను 11కు త్రిప్పి, మార్తను మంచి రోజున చూద్దాం.

లాజరు చనిపోయిన తరువాత ప్రభువైన యేసు బేతనియకు వచ్చినప్పుడు, మార్త ఆయనతో- ''ప్రభువా, నీవిక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండును. ఇప్పుడైనను నీవు దేవుని ఏమడిగినను దేవుడు నీకనుగ్రహించునని యెరుగుదుననెను'' (యోహాను 11:21-22). అది తన విశ్వాసాన్ని బహు ఉన్నతంగా వ్యక్తపరచడమే కదూ? 27వ వచనంలో ఆమె మాటలను తిరిగి గమనించు: ''-అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచు న్నానని ఆయనతో చెప్పెను'' ''నేను నమ్మాను'' అనేది లోపంలేని క్రియా వాచకం. అంటే గతంలో మార్త నమ్మికయుంచింది. అది యిప్పుడు తనలో స్థిరపడి పోయింది. తరువాత యోహాను యిలా వ్రాశాడు: ''మరియు అనేకమైన యితర సూచిక క్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను'' (యోహాను 20:30-31). మార్త ఉపయోగించిన మాటలనే, యేసును వర్ణించడానికి యోహాను వినియోగించాడు! నీవు, నేను కలిగి యుండవలసిన విశ్వాసానికి మాదిరిగా యోహాను మార్తను ఉపయోగించాడు!

చెడ్డ దినాల అనుభవంనుండి పాఠాలు నేర్చుకొని, వాటి ఫలితాల మూలంగా మనం బలపరచబడినట్టయితే, అవి మంచి రోజులుగా మారిపోతాయి. అలా జరిగినప్పుడు - చెడ్డదినాల వైపు చూచి -''నాకు బోధించి నన్ను బలపరచడానికి దేవుడు ఆ దినాలను ఉపయోగించు కున్నారని'' చెప్పవచ్చు. ప్రభువైన యేసు మనలను గూర్చి చింతిస్తున్నారని మనం తెలిసికోగలం.

## మనకు చెడ్డరోజులు ఎదురైనప్పుడు

మనకు చెడ్డ దినాలెదురైనప్పుడు మనంగా నేర్చుకోవలసిన పాఠాలేమో, కొన్ని యిక్కడ సూచించబడ్డాయి జాగ్రత్తగా గమనించు:

**చెడ్డ దినాలప్పుడప్పుడు ప్రతి ఒక్కరికి వస్తాయని గుర్తించాలి**

కొన్నిసార్లు చెడ్డ దినాలను ఎదుర్కొన్న విశ్వాసులైన స్త్రీ పురుషులతో బైబిలు నిండి ఉంది. ఏలీయాకు తన చెడ్డ దినాలున్నాయి. దుష్ట శక్తులకు వ్యతిరేకంగా, ధైర్యవంతుడైన ఆ ప్రవక్త, మాటి మాటికి నిలువ వలసి వచ్చింది. అయినా ఒకరోజు గుహలో జొరబడి, తాను చస్తే బాగుండునని ఏలీయా తలంచాడు (1రాజులు 19). యిర్మీయా అనే మరో ప్రవక్తకు అనేక చెడ్డ దినాలు ఎదురయ్యాయ్ (యిర్మీయా 20:7-10).

బాప్తిస్మమిచ్చు యోహానుకు ఒక చెడ్డదినం వచ్చింది. తాను చెరసాలలో బంధింపబడిన తరువాత '' - రాబోవువాడవు నీవేనా? లేక మరియొకని కొరకు మేము కనిపెట్టవలెనా?'' అని అడగడానికి అతడు తన శిష్యులను ప్రభువైన యేసునొద్దకు పంపాడు (లూకా 7:20). యేసువైపు తన వ్రేలుచూపి - ''ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల'' అని గొప్ప నిశ్చయతతో యోహాను చెప్పిన తరువాతనే యిది జరిగింది (యోహాను 1:29, 36)! చీకటి, చలి, తేమగానున్న చెరసాలలో యోహాను ఒంటరిగా ఉండగా అతనికీ చెడ్డదినం ఎదురయ్యింది.

**మన చెడ్డదినాల నిమిత్తం ఇతరులను నిందించే తత్వం విషయమై జాగ్రత్త**

తన చెడ్డదినం కొరకు మార్త మరియను, ప్రభువైన యేసును నిందించింది. ఇతరులను నిందించడం అనే మానవ తత్వాన్ని మన మందరం ఎదిరించాలి. మనకు చెడ్డరోజు వచ్చిందంటే- సాధారణంగా, చెడ్డ సంగతులు జరిగినందుకు కాదుగాని; సంభవించిన వాటికి మనం బదులిచ్చిన దానిమీదనే అది ఆధారపడి యుంటుంది.

**మనకు సంభవించిన దానికి ప్రతిచర్య చేసేటప్పుడు, అలా చేసినదానికి ఫలితాలొస్తాయన్న సంగతి గుర్తించుకో!**

మార్త ప్రభువుమీద తన విసుగును కనుపరచింది. దానికి ప్రతిఫలంగా ఆమె ప్రభువుచేత మందలింపబడింది. సంభవించిన చెడ్డ కార్యాలకు వ్యతిరేకమైన ప్రతిచర్యను చేసినట్లయితే, చెడ్డదినం తప్పక మరింత చెడ్డగా మారుతుంది.

**దాన్ని మనం అలాగే వదలకపోయినట్లయితే చెడ్డ దినమే మన జీవితాలకు అంతం కాదు. ఈ వాస్తవంచే ఆదరించ బడదాం**

తన చెడ్డదినాన్ని తన జీవితపు కడాపటి దినంగా మార్త కానియ్యలేదు. యోహాను 11, 12ల్లో మార్తయొక్క అందమైన ఫొటో చిత్రాలున్నాయి. మన చెడ్డరోజులు మన జీవిత గాథలకు అంతం కాకుండా చూచుకోవాలి (జీవితపు మార్పు గతాన్ని మరిపిస్తుంది. అలాటిది కావాలనే మహోన్నతుడు మనుష్యులపట్ల కోరి, దీర్ఘశాంతుడై యున్నారు).

### నిజంగా జీవితానికి ప్రాముఖ్యమైన దానిని చెడ్డదినాల్లో నుండి నేర్చుకోడానికి తీర్మానించుకో

నీకు చెడ్డదినం తటస్థించినప్పుడు, ఆగి, ''దీన్ని చెడ్డ దినంగా మార్చు తున్నదేది?'' నా సంతోషాన్ని పాడు చేస్తున్నదేది? నన్ను, నా చుట్టునున్నవారినీ పరితాపకరంగా చేస్తున్నదేది? అని అడుగు, సమస్యను కనుగొన్న తరువాత - ఆ కారణాన్ని నీవు వేరుచేసినప్పుడు, ''ఇది నిజంగా అంత ప్రాముఖ్యమయ్యిందా''? అని నిన్ను నీవే ప్రశ్నించుకో. నిజంగా ఏమి సంభవిస్తుందో అది నీవు గ్రహించినప్పుడు, చెడ్డదినాలు మంచిరోజులుగా మారిపోతాయి (దినం చెడ్డగా మారడానికి హేతువేదో కనుక్కొని, దాన్ని తొలగించు కొన్నప్పుడు, చెడ్డదినం మంచిదినంగా మారుతుంది - దానికదే చెడ్డరోజు ఉండదు).

## ముగింపు

ప్రతి ఒక్కరికి అప్పుడప్పుడు ఓగైన (చెడ్డ) దినం వస్తుంది. మార్త యొక్క గాధనుండి పాఠం నేర్చుకొనడానికిగాను, ఆత్మసంబంధమైన సంగతులను నీ జీవితంలో ప్రధానమైనవిగా నిలుపుకున్నట్టయితే, ఆ చెడ్డదినమే అత్యుత్తమమైన రోజుగా మారుతుంది. అయితే ఒక విషయంమాత్రం చాలా ప్రాముఖ్యం: ''ప్రభువుకు నిన్ను నీవు అప్పగించుకొనడం'' అనేది నీ యొద్దనుండి ఎన్నడు తొలగింపబడని భాగ్యం. ఇంతవరకు ఎలాటి దినాలను ఎదుర్కొన్నావో నాకు తెలియదుగాని, యేసు పాదాల దగ్గర కూర్చుండి, ఆయన చిత్తాన్ని[2] జరిగించడాన్ని నేర్చుకున్న - ఆ దినం- నీకు మంచిదిగా, శాంతికరమైనదిగా, గొప్పదిగా మారుతుంది!! (అనుదినం నీకు అలాగే ఉండాలనుకుంటే - ఆ పనిని నీవు మానక కొనసాగించు).

---

సూచనలు

[1]అనేక విధాలుగా దీన్ని వర్తింపజేయవచ్చు. ఆయా సమయాల్లో మనమందరం మార్తలా, ప్రాముఖ్యంకాని విషయాల్లో అత్యధికమైన శ్రద్ధచూపుతూ, ప్రాముఖ్యమైన దాన్ని అలక్ష్యం చేస్తూవుంటాం. నీ శ్రోతలకు లేక నీకు ఎక్కువ అవసరమైన విధంగా దీన్ని వర్తంప జేస్తూవుండు (మేలు కలుగుతుంది).

[2]ఆహ్వానంలో - ప్రభువునకు విధేయత చూపడానికి యిది శుభదినం లేక పునరుత్థరించబడడానికి యిది పర్వదినం అని నీవు సూచింపవచ్చు.